క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్తంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్ నేత్రాలయా ఆస్పత్రిలో ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

శ్మశాన గోడ ధ్వంసం

పూతలపట్టు: మండలంలోని పోలవరం పంచాయతీలో నూతనంగా నిర్మిస్తున్న శ్మశాన గోడను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం అర్ధరాత్రి గోడను కూల్చివేసినట్లు గుర్తించిన గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏకాగ్రతతో చదవాలి



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న పాస్టర్

చిత్తూరు రూరల్: పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు ఏకాగ్రతతో చదివి, మంచి మార్కులు తేవాలని టౌన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టియన్‌దాస్ అన్నారు. పదో తరగతి పరీక్షల దృష్ట్యా చిత్తూరు నగరంలోని టౌన్ చర్చిలో ఆదివారం పదోతరగతి విద్యార్థులకు ఆయన పలు సూచనలు చేసి పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. కార్యక్రమంలో సభ్యులు డానియేల్, నిరూపకుమార్, దెబోరోలా, సురేంద్రకుమార్, జ్ఞానశేఖర్, ప్రేమ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలు

గంగవరం: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బైరకూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులుశెట్టి(70), ఆయన తమ్ముడి కుమారుడు యువరాజు(22) ఇద్దరు ద్విచక్ర వాహనంలో మండలంలోని ఆలకుప్పానికి బయలు దేరారు. ఆలకుప్పం గ్రామానికి సమీపంలోకి రాగా బెంగళూరు నుంచి చెన్నైకి వెళుతున్న కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచిఢీ. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న శ్రీనివాసులుశెట్టికి తీవ్రగాయాలు కాగా, యువరాజుకి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వృద్ధుడి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కోలారు మెడికల్ కళాశాలకు రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళా పోలీస్‌కు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న రాష్ట్ర కమిటీ సభ్యులు

నగరి : వడమాలపేట టోల్‌గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన నగరి మండలం బుగ్గ అగ్రహారం సచివాలయ మహిళా పోలీస్ నవీనకు రాష్ట్ర మహిళా పోలీస్ అసోయేషన్ వారు ఆర్థికసాయం అందించారు. ఆదివారం తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నవీనను కలిసిన వారు ఆమె ఆరోగ్య క్షేమాలను విచారించారు. అసోసియేషన్ తరఫున పోగుచేసిన రూ.1.5 లక్షల ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత, జిల్లా కమిటీ అధ్యక్షురాలు శివగామి, జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు శైలజ, దివ్యారెడ్డి, మండల, మున్సిపల్ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష కుంకుమార్చన

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన లక్ష కుంకుమార్చన ఆదివారం ఘనంగా ముగిసింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చన చేపట్టారు. మూడు రోజులు జరిగిన పూజల్లో 1,550 మంది దంపతులు పాల్గొన్నారు. మధ్యాహ్నం చేపట్టిన మహా పూర్ణాహుతితో లక్ష కుంకుమార్చన ముగిసింది. తర్వాత కలశ జలాలతో సంప్రోక్షణ చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కలశాన్ని నెత్తిన పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. మేయర్ డాక్టర్ శిరీష, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం చారిత్రాత్మకం



బంగారుపాళెం: బోడబండ్లలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే



పూతలపట్టు: పిల్లలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన కోసం స్థాపించిన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం చారిత్రాత్మక ఘట్టమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండలంలోని బోడబండ్ల గ్రామంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పార్టీ నాయకులతో కలిసి వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు పంచారు. ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మొగిలీశ్వర్, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, ఎంపీటీసీ హరి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, నాయకులు శరత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, దొరస్వామి, ఫిరోజ్‌అహ్మద్, మహేంద్ర, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్టీ ఆవిర్భావణ దినోత్సవం

పూతలపట్టు: మండలంలోని సింగల్‌విండో కార్యాలయం వద్ద ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మాట్లాడుతూ.. దేశ రాజకీయ చరిత్రలోనే వైఎస్సార్‌సీపీ ప్రస్థానం చాలా ప్రత్యేకమని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. అనంతరం చిన్న పిల్లలతో కట్ చేయించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, దొరస్వామిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి



బంగారుపాళెంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ బెన్నురాజ్

బంగారుపాళెం: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో పట్టభద్రుల ఓటర్లు 2210, ఉపాధ్యాయ ఓటర్లు 145 మంది ఉన్నట్లు చెప్పారు.



ఐరాలలో తహసీల్దార్, ఎంపీడీఓ

సర్వం సిద్ధం

ఐరాల: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ సుశీలమ్మ, ఎంపీడీఓ నిర్మలాదేవి తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండలంలో పట్టభద్రులు 1916, ఉపాధ్యాయ ఓటర్లు 131 మంది ఉన్నారని తెలిపారు. మూడు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తవణంపల్లె: మండలంలో పట్టభద్ర ఓటర్లు 1653, ఉపాధ్యాయ ఓటర్లు 58 మంది ఉన్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నరేష్ తెలిపారు. తవణంపల్లె హైస్కూల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. తవణంపల్లె పోలింగ్ కేంద్రాలను చిత్తూరు ట్రాఫిక్ డీఎస్పీ తిప్పేస్వామి పరిశీలించి పలు సూచనలు చేశారు. చిత్తూరు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఐ ప్రసాద్ ఉన్నారు.



తవణంపల్లె: ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న అధికారులు

యాదమరిలో 1554 మంది ఓటర్లు

యాదమరి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో 1554 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. మండల కేంద్రంలో సాయంత్రం 4 గంటల వరకు దుకాణాలు తెరవరాదని చెప్పారు.

కనులపండువగా పుష్పపల్లకి



పల్లకి సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం బజారువీధిలో వెలసిన శ్రీ శివషణ్ముగ సుందర వినాయకస్వామి ఆలయంలో ఆదివారం కూడా కుంభాభిషేక 6వ వార్షికోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ నిర్వాహకులు పుష్పపల్లకి సేవను కనుల పండువగా జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన పుష్పరథంలో స్వామివారిని ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన సతీమణి సత్యవతి పాల్గొన్ని స్వామి వారిని దర్శించుకున్నారు. పాలకమండలి సభ్యులు వారిని ఘనంగా సన్మానించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో చైర్మన్ కణ్ణన్, ఆలయ అర్చకులు శ్రీధర్, ఈఓ తిమ్మారెడ్డి, సభ్యులు విజయరాఘవులు, శ్రీధర్, పుష్పలత, రాజేంద్రబాబు, వరలక్ష్మి, రాము, మణికంఠ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'



గుడిపాల: గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

గుడిపాల: విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసేందుకు చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహస్తున్నట్లు గుడిపాల శాఖా గ్రంథాలయాధికారి గజేంద్ర అన్నారు. ఆదివారం గుడిపాల గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి జీవితచరిత్రలు, జనరల్‌నాలెడ్జ్, న్యూస్‌పేపర్లతో పాటు పలు పుస్తకాలను చదవడం వల్ల వారిలో నైపుణ్యత పెరగడంతో పాటు ఉద్యోగాలు పొందేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ మల్లికార్జున పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్‌లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

– ఆర్డీఓ రేణుక



చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు చిత్తూరు డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీఓ రేణుక తెలిపారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో పట్టభద్రులకు 31, టీచర్ ఎన్నికలకు 12 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓట్లు వేసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని వెల్లడించారు. సోమవారం పోలింగ్ పూర్తి కాగానే డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల సిబ్బంది పీవీకేఎన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్సులను తీసుకొస్తారని చెప్పారు. ఇందుకు పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. అనంతరం పీవీకేఎస్ నుంచి కౌంటింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులను తరలిస్తామని ఆర్డీఓ వెల్లడించారు.

జగనన్నతోనే మహిళా సాధికారత

- రాస్ సేవలు ప్రశంసనీయం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా



గర్భిణులకు సీమంతం చేస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: నేటి జగనన్న ప్రభుత్వం మహిళా సాధికారిత దిశగా పరుగులు పెడుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు కల్యాణ మండలంలో రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి మాట్లాడుతూ మహిళలకు సామాజికంగా సముచిత స్థానం కల్పించడమే కాకుండా ఆర్థిక భరోసాను అందిస్తున్నారని తెలిపారు. లింగ వివక్షత చూపకుండా ప్రతి ఇంట్లో అబ్బాయిని, అమ్మాయిని సమానంగా పెంచాలని, అప్పుడే ఆ ఇంటి నుంచే మహిళా సాధికారిత మొదలవుతుందని వివరించారు. రాస్ సేవాసంస్థ కొన్ని వేలమంది మహిళలకు అండగా నిలబడి, ఆర్థికాభివృద్ధి సాధించడానికి ఎంతగానో కృషి చేస్తోందని చెప్పారు. ఆర్థిక క్రమశిక్షణతో పాటు కుటుంబ క్రమశిక్షణ నేర్పిస్తూ అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. వృద్ధులకు చేతి కర్రలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం, ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజు, ప్రాజెక్టు ఆఫీసర్లు తపోవని, రవి, బానాజీరెడ్డి, వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, వార్డు కౌన్సిలర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఆర్కే రోజా



సమావేశానికి హాజరైన మహిళలు

ఘనంగా కుంభాభిషేకం



గుడిపాల: వినాయకస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

గుడిపాల: వినాయకస్వామి ఆలయంలో కుంభాభిషేకం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, సప్తసంహోర పూజ, రెండవకాల మహాకుంభాభిషేకం, పూర్ణాహుతి, మహాయోగం వేదపండితులతో నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

బండపల్లె గ్రామంలో జరిగిన కుంభాభిషేకం కార్యక్రమానికి చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రజినీకాంత్, నాయకులు వెంకటేష్‌రెడ్డి, శంభు, పెద్దబ్బగౌడ్, ప్రకాష్ పాల్గొన్నారు. వారికి వేదపండితులు ఆశీర్వచనాలు ఇస్తూ స్వామివారి ప్రసాదాలను వారికి అందజేశారు.



కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే

14, 15 తేదీల్లో సుగుటూరు గంగమ్మ జాతర

- రెండు రోజులు పూజలు
- మంత్రి పెద్దిరెడ్డి రాక

పుంగనూరు: పట్టణంలో కులమతాలకతీతంగా సుమారు ఎనిమిది శతాబ్దాలుగా జమీందారుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర ఈనెల 14, 15 తేదీలలో రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఏటా జాతరలో అమ్మవారికి సారేను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా సమర్పించనున్నారు. రెండు రోజులు పాటు జరిగే ఈ జతరకు కర్ణాటక, తమిళనాడు నుంచి వేలాది మంది రానున్నారు. జాతరలో బంధుమిత్రులతో కలసి విందు భోజనాలతో కాలక్షేపం చేస్తారు.

సుగుటూరు గంగమ్మ చరిత్ర ....

పుంగనూరు జమీందారులు సుగుటూరు వంశస్తులు. వీరు కీలకపాత్ర పోషించారు. పుంగనూరు జమీందారి పాలన పలమనేరు, సదుం, మదనపల్లె వరకు సాగింది. తొలి సారిగా క్రీ.శ.600 సంవత్సరాల నుంచి జమీందారి పాలన ఇటు కర్ణాటక, గుర్రంకొండ వరకు సుగుటూరు వంశస్తులు సుమారు 700 గ్రామాలను తమ పరిధిలో ఉంచుకుని పరిపాలన సాగించారు. సుగుటూరు వంశస్తులైన రణబైరేగౌడు అనే వ్యక్తి తొలి సారిగా కర్ణాటకలో ఉన్న సుగుటూరు ప్రాంతాన్ని పాలించేవారు. అక్కడి నుంచి పుంగనూరులో వచ్చి స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. అప్పటి నుంచి ఏటా జమీందారుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర జమీందారీల సంప్రదాయ రీతిలో నిర్వహిస్తారు.



జాతరలో పూజలందుకోనున్న శ్రీసుగుటూరు గంగమ్మ

జాతర నాలుగు సార్లు జరగలేదు

కర్ణాటకలోని జంగమకోట సుగుటూరులో ప్రారంభమైన సుగుటూరు గంగమ్మజాతర అక్కడ 75 సంవత్సరాలు నిర్వహించారు. అనంతరం బైల్ సుగుటూరులో 150 సంవత్సరాలు, పుంగనూరులో 563 సార్లు జాతర నిర్వహించారు. ఇప్పటికి 788 సార్లు జాతర జరిగినట్లు చరిత్ర చెబుతోంది. టిప్పు సుల్తాన్ వారి పాలనలో రెండు సార్లు, జాతర సమయంలో ఒక జమీందారు యుద్ధంలో చనిపోవడం, మరొకసారి పుంగనూరులో ప్లేగువ్యాధి రావడంతో జాతర ఆపివేసినట్లు తెలుస్తోంది.

జాతర ఇలా....

జమీందారుల కుల దైవమైన సుగుటూరు గంగమ్మకు మంగళవారం తొలుత ప్యాలెస్‌లో జమీందారులు విజయరాణెమ్మ, సోమశేఖర్ చిక్కరాయులు, మల్లికార్జున రాయులు, వారి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహిస్తారు. అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి, బుధవారం ఉదయం భక్తుల సందర్శనార్థం ఆలయంలోకి అనుమతిస్తారు. అమ్మవారికి బెస్తవారు, యాదవ కులస్తులు, తోటి కులస్తులు పూజలు ఘనంగా నిర్వహిస్తారు. అలాగే బజారువీధిలో నడివీధి గంగమ్మ, తూర్పు మొగసాలలో గంగమ్మ, బాలాజీ థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూరు బ్యాంకు వద్ద నలగంగమ్మ, బస్టాండ్‌లో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నలగంగమ్మ, కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మకు భక్తులు పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే విరూపాక్షి మారెమ్మను పట్టణంలో పల్లకిలో ఊరేగిస్తారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలివస్తారు. భక్తులు మట్టి కుండలకు మామిడి ఆకు, వేపాకు, పూలు పెట్టి గెరిగెలు తయారు చేసి గెరిగెలను మహిళలు, పురుషులు స్త్రీల వేషధారణతో వచ్చి ఆలయం చుట్టు మూడు ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లిస్తారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం



గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామివారి కల్యాణోత్సవాన్ని అర్చకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకించి పరిమళ పుష్పాలు, ఆభరణాలతో స్వామివారి ఉత్సవ మూర్తులను అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీవారి ఉత్సవ మూర్తులను స్వామివారి కల్యాణ మండపానికి ఊరేగింపుగా వేంచేపు చేశారు. ఉభయదారులను కల్యాణోత్సవానికి కంకణధారులను చేశారు. శ్రీవారికి ఎదురుగా శ్రీదేవి, భూదేవి విగ్రహాలను ఉంచి పూజలు చేపట్టారు. అర్చకులు హోమం నిర్వహించారు. మంత్రోచ్ఛరణలతో శ్రీదేవి, భూదేవి మెడలో అర్చకులు మాంగళ్యధారణ క్రతువును పూర్తి చేశారు. భక్తులు కానుకలు సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారిని దర్శించుకున్నారు.